సాక్షి నిర్మల్

బుధవారం ‌। 11 ‌। సెప్టెంబర్ ‌। 2024



విద్యా సామర్థ్యాల సాధనకు న్యాస్

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం మాక్ టెస్టులు నిర్వహించారు.

8లో▸

పీఏసీ సభ్యుడిగా రామారావు పటేల్



భైంసాటౌన్: ముథోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ పీఏసీ(పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) సభ్యుడిగా నియమితులయ్యారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ బీజేపీ నుంచి పవార్ రామారావు పటేల్‌కు అవకాశం కల్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.1 /24.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాత పెన్షన్ పునరుద్ధరణకు కృషి



శ్రీదేవిని సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: పదేళ్లుగా సీపీఎస్ రద్దు కోసం అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వాలు స్పందించడం లేదని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే సీపీఎస్ రద్దు చేయాలనే లక్ష్యంతో తాను శాసనమండలి బరిలో దిగుతున్నానని తెలిపారు. పాత పెన్షన్ సాధనే అంతిమ లక్ష్యంగా అందరి సహకారంతో ముందుకు వెళ్తానన్నారు. కార్యక్రమంలో ఇటీవల నూతనంగా ప్రిన్సిపాల్ బాధ్యతలు స్వీకరించిన అబ్దుల్ హమీద్‌తోపాటు ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన శ్రీదేవిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేందర్, రేవంత్, రవీందర్, సంతోష్‌రెడ్డి, నరహరి, నాగరాజు, బాపు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని స్నేహ వికలాంగుల సంక్షేమ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడిచినా దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. వికలాంగులకు సకాలంలో సదరం సర్టిఫికెట్లను అందించడంలో జాప్యం చేయడంతో వేలాది మంది దివ్యాంగులు సర్టిఫికెట్లు లేక ప్రభుత్వ పథకాలకు అర్హులు కావడం లేదని తెలిపారు. అర్హులైన దివ్యాంగులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ముత్యం, సాయన్న, శ్రీనివాస్, వెంకటి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద: వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పలు వినాయక మండపాలను సోన్ సీఐ నవీన్‌కుమార్‌తో కలిసి మంగళవారం సాయంత్రం సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ నిమజ్జన సమయంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా మండల ప్రజలు, యూత్ సభ్యులు సహకరించాలన్నారు. ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనానికి పోలీస్ శాఖ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. వారివెంట ఎస్సై సుమలత, పీసీలు ఉన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌ఖిల్లాగేట్: నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి తాత్కాలిక పద్ధతిలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ మాధ్యమంలో చరిత్ర –1, ఆర్థిక శాస్త్రం –1, తెలుగు మాధ్యమంలో తెలుగు –1, ఖాళీలు ఉన్నాయన్నారు. అధ్యాపకులు అన్ని అర్హత పత్రాలతో సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 16వ తేదీన ఉదయం 11 గంటలకు డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. యూజీసీ ఉత్తర్వుల ప్రకారం పీజీలో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9963417809 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కళాశాలనూ వదలరా?



నిర్మల్-మంచిర్యాల రహదారిపై రాస్తారోకో చేసిన డిగ్రీ కాలేజీ విద్యార్థులు

- డిగ్రీ కాలేజీ స్థలంపై కబ్జాదారుల కన్ను
- హద్దులు దాటి నిర్మాణాలు
- రోడ్డెక్కి నిరసన తెలిపిన విద్యార్థులు
- స్పందించిన కలెక్టర్, పరిశీలించిన అధికారులు



కళాశాల మైదానంలో ఆక్రమించినట్లు చెబుతున్న స్థలం

నిర్మల్: నిర్మల్‌లో కాదేదీ కబ్జాలకనర్హం... అనే మాట ఇంకా కొనసాగుతూనే ఉంది. మొన్నటి వరకు చెరువులపై పడ్డ కబ్జాదారులు.. హైడ్రా తరహాలో నిద్రా వచ్చే అవకాశం ఉందని తెలియడంతో ఇప్పుడు ప్రభుత్వ స్థలాలపై దృష్టిపెట్టారు. జిల్లా కేంద్రంలో తాజాగా చోటుచేసుకున్న ఘటన చర్చనీయాంశంగా మారింది. ఏకంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్నే ఆక్రమించి, నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించారు. తమ కాలేజీ స్థలాన్ని ఆక్రమించడంపై విద్యార్థులు కన్నెర్రజేశారు. రోడ్డెక్కి నిరసన తెలిపారు. వీరికి విద్యార్థి సంఘాలు, స్థానికులు, వాకర్స్ సంఘాలు, తదితరులంతా మద్దతు తెలిపారు. దీంతో కబ్జా పర్వం అధికారుల దృష్టికి వెళ్లింది.

కాలేజీపై కన్ను..

జిల్లా కేంద్రంలో కనుచూపు మేరలో ఎక్కడా ప్రభుత్వ స్థలాలు మిగల్లేదు. అసైన్డ్, లావోణి, ప్రభుత్వ భూములన్నీ ఆక్రమణల్లో ఉన్నాయి. చెరువులనే వదలని కబ్జాదారులు ఇక సర్కారు జాగాలను వదులుతారా.. అన్నట్లుగా తయారైంది. నిర్మల్‌లో ఇక మిగిలింది ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థలం మాత్రమే. ఇప్పుడు దానిపైనా కన్నుపడింది. పట్టణమంతా మంచిర్యాల రోడ్డువైపు పెరుగుతూ పోవడంతో ఆ ఏరియాకు డిమాండ్ పెరిగింది. ఇదే క్రమంలో ఈవైపు ఉన్న డిగ్రీ కాలేజీ స్థలంపైనా చాలా మంది కన్ను పడింది. గతంలో కళాశాల వెనుకభాగంలో పలువురు రాజకీయ అండదండలతో ఆక్రమణలకు ప్రయత్నించారు. తమకు ఇక్కడ స్థలాలను కేటాయించారంటూ నిర్మాణాలను చేపట్టే ప్రయత్నం చేయగా, కళాశాల అధ్యాపకులు అడ్డుకున్నారు.

పునాది పైనుంచే..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్రమణలకు అవకాశాలు పెరుగుతుండటంతో 2021లో కాకతీయ యూనివర్సిటీ రూ.52 లక్షలు వెచ్చించి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టింది. దాదాపు చుట్టూ పూర్తిచేసినా ముందువైపు ఓ మూలన మాత్రం కొన్ని నివాసాలు ఉండటంతో ప్రహరీ నిర్మాణం అక్కడ నిలిచింది. అప్పట్లో ఇక్కడ నిర్మాణాలపై కోర్టు స్టే రావడం, తర్వాత నిధుల కొరతతో పనులు సాగలేదు. తాజాగా సదరు కాలేజీ ప్రహరీకి సంబంధించిన పునాదిని దాటి మరీ నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.

రోడ్డెక్కిన విద్యార్థులు..

ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అంటూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతుంటే.. ఇక్కడ తమ కాలేజీని కబ్జా చేస్తున్నారంటూ డిగ్రీ కళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాలరోడ్డులో రాస్తారోకో చేశారు. వీరికి విద్యార్థి, వాకర్స్ సంఘాలు, స్థానికులు మద్దతు తెలిపారు. తమ కాలేజీ స్థలాన్ని కాపాడాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్‌తోసహా సంబంధిత శాఖలకు ఫిర్యాదులు అందించారు. స్పందించిన కలెక్టర్ అభిలాష అభినవ్ వెంటనే విచారణ చేపట్టాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఈమేరకు రెవెన్యూ, మున్సిపల్, ల్యాండ్ సర్వే తదితర శాఖల అధికారులు వచ్చి పరిశీలించారు.

సర్వే చేయిస్తాం..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని ఆక్రమించారన్న ఫిర్యాదు నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించాం. ఆ ప్రాంతాన్ని పూర్తిగా సర్వే చేయించి వివరాలు తీసుకుంటాం. తర్వాత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– రాజు, నిర్మల్ అర్బన్ తహసీల్దార్

ఖానాపూర్‌లో శిశువు విక్రయం

- పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన యువతి
- సఖి కేంద్రానికి అప్పగించిన కుటుంబ సభ్యులు
- 21 రోజుల క్రితం మగబిడ్డకు జననం.. గుట్టుగా విక్రయం
- ఈ నెల 6న తనిఖీకి వెళ్లిన.. సఖి సిబ్బందికి కనిపించని శిశువు
- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు..
- కూపీ లాగితే కదిలిన డొంక..
- తల్లితో సహా ఆరుగురిపై కేసు..



శిశువును స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఖానాపూర్: పుట్టిన 21 రోజులకే శిశువును విక్రయించిన సంచలన ఘటన ఖానాపూర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సఖీ సభ్యుల తనిఖీ సమయంలో శిశువు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూపీ లాగితే డొంక కదిలింది. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. ఖానాపూర్ సీఐ సైదారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన ఓ యువతి పెళ్లి కాకుండాగా గర్భం దాల్చింది. కుటుంబ సభ్యులు విషయం బయటకు రాకుండా ఆమెను నిర్మల్‌లోని సఖీ కేంద్రంలో చేర్పించారు. అక్కడే ఉంచి నెలనెలా వైద్య పరీక్షలు చేయించారు. 21 రోజుల క్రితం పురిటి నొప్పులు రావడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే బాబుకు జన్మనిచ్చింది. తర్వాత సఖీ సభ్యులు తల్లి, బిడ్డను తీసుకువచ్చి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫాలోఅప్‌లో భాగంగా ఈ నెల 6న తల్లీబిడ్డ పరిస్థితి తెలుసుకునేందుకు సఖీ సభ్యులు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరూ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులను ఆరా తీశారు. వారు పొంతనలేని సమాధానం చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన సఖీ సభ్యులు శిశువు అమ్మమ్మతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు.

కూపీ లాగితే కదిలిన డొంక..

మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో కలిసి రంగంలోకి దిగారు. ఖానాపూర్, కడెం మండలాల్లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కడెం మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన టేకం రాధ(యువతి చిన్నమ్మ)తో కలిసి మధ్యవర్తి కొమ్ము భాగ్య సహకారంతో రూ.52 వేలకు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన బెక్కం రాధకు విక్రయించినట్లు గుర్తించారు. దీంతో రంగపేటకు వెళ్లి శిశువును స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు చూపించిన అనంతరం జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రికి తరలించారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐతోపాటు ఎస్సై లింబాద్రిని ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.



అపహరణకు గురైన శిశువు

ఆరుగురిపై కేసు..

ఈ ఘటనకు సబంధించి బాలుడి తల్లితోపాటు, చిన్నమ్మ టేకం రాధ, కొమ్ము గంగారం అలియాస్ యోగి, కొమ్ము భాగ్య, జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేట్‌కు చెందిన శిశువు కొనుగోలుదారులు బెక్కం లక్ష్మీరాజం, బెక్కం రాధపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సైదారావు తెలిపారు.

సురక్షితంగా శిశువు...

ఖానాపూర్ పట్టణంలో అపహరణకు గురైన 21 రోజుల శిశువు ఆరోగ్యంగానే ఉన్నాడని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో కలిసి పోలీసులు శిశువును కాపాడినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆసుపత్రిలో బాలుడిని పరిశీలించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఘటనకు బాధ్యులపై కఠినచర్యలు ఉంటాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 1098 టోల్‌ఫ్రీకి లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 63056 46600 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పునరావాస గ్రామంలో వసతులు కల్పించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌ఖిల్లాగేట్: కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించిన కడెం మండలం కొత్త మద్దిపడగలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పునరావాస ప్రజలకు కల్పిస్తున్న వసతులపై గ్రామస్తులు, అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పనులకు సంబంధించిన సమాచారాన్ని శాఖల వారీగా సమీక్షించారు. పునరావాసం పొందిన ప్రజలకు కేటాయించిన వ్యవసాయ భూములను సాగుకు యోగ్యంగా మార్చాలని ఆదేశించారు. గ్రామంలో హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలన్నారు. అన్ని పనులు నాణ్యతతో చేయాలని పేర్కొన్నారు. ఈ వారంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ పథకాన్ని గ్రామస్తులంతా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఇవ్వాలని తెలిపారు. అర్హులైన వారికి పంట రుణాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు ప్యాకేజీ 1 కింద రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. గ్రామస్తుల పంట భూములకు సంబంధించి రెవెన్యూ పట్టాల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నాకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, ఇంజినీరింగ్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌ఖిల్లాగేట్: చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేనిదన్నారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యయనాన్ని లిఖించిందని తెలిపారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చాకలి ఐలమ్మ లాంటి వీర వనితల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా జిల్లాలో రజకులకు శిక్షణ కేంద్రాల ద్వారా భృతితో కూడిన శిక్షణ అందించి, గుర్తింపు పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన రజకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, పరిశ్రమల శాఖ అధికారి నరసింహారెడ్డి, కుల సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: చాకలి ఐలమ్మ పోరాటం.. తరతరాలకూ స్ఫూర్తిదాయకమని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. ఐలమ్మ వర్ధంతిని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ వీరవనిత చిట్యాల ఐలమ్మ వెనుకబడిన కులంలో జన్మించి, కులవృత్తి జీవనాధారంగా జీవిస్తున్న సమయంలో ఎదురైన అవమానాలకు ఎదురొడ్డి నిర్విరామ పోరాటం చేశారన్నారు. దొరల పాలనకు చరమగీతం పాడిన వీర వనిత అని కొనియాడారు. ఆమె పోరాటాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

డిజిటల్ దిశగా ఆర్టీసీ

- బస్సుల్లో ఇక ఆన్‌లైన్ పేమెంట్స్
- ఏఎఫ్‌సీఎస్ అమలుకు కసరత్తు
- వేగవంతం కానున్న టికెట్ల జారీ ప్రక్రియ
- అన్ని సర్వీసుల్లో ప్రారంభానికి యోచన

ఆదిలాబాద్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో టీజీఎస్‌ఆర్టీసీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా డిజిటల్ పేమెంట్స్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చేలా కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ప్రతీ ఒక్కరి చేతుల్లో స్మార్ట్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. ఎక్కడ లావాదేవీలు జరిగినా పేమెంట్స్ యాప్స్ ద్వారా ప్రజలు నగదు రహిత చెల్లింపులు చేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం (ఏఎఫ్‌సీఎస్) అమలుకు ప్రజా రవాణా సంస్థ సమాయత్తమవుతోంది. సెప్టెంబర్ నెలాఖరులో ఈ సేవలు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

ప్రయాణాలు ఇక సులభతరం..

ఆర్టీసీని పలు సందర్భాల్లో చిల్లర సమస్య వేధిస్తోంది. దీనిని అధిగమించాలనే ఆలోచనతో పాటు ప్రయాణికులు సులభంగా పేమెంట్స్ చేసేలా సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే పలు ఉన్నతశ్రేణి బస్సులు, దూరప్రాంత సర్వీసుల్లో ఈ పైలెట్ ప్రాజెక్టు చేపట్టగా విజయవంతం అయ్యిందని అధికారులు భావిస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఏఎఫ్‌సీఎస్ అమలుకు ప్రణాళికలు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఉన్న 586 బస్సుల్లో సైతం ఈ-చెల్లింపుల విధానం అమల్లోకి రానుంది. లహరి, సూపర్ లగ్జరీ, రాజధాని, సెమీ డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసుల్లో ఈ విధానం ప్రవేశపెట్టాలని సంస్థ భావిస్తోంది.

ఇక క్షణాల్లో చెల్లింపులు..

ప్రస్తుతం ఆర్టీసీలోని అన్ని బస్సుల్లో టికెట్లు ఇష్యూ చేయడానికి టిమ్స్ వినియోగిస్తున్నారు. ఇక నుంచి వీటి స్థానంలో ఇంటలిజెంట్ టికెట్ ఇష్యూ మెషిన్ (ఐ–టిమ్స్) ప్రవేశపెట్టనున్నారు. ఈ ఐటిమ్స్‌కు ఇంటర్నెట్ అనుసంధానమై ఉంటుంది. ఆండ్రాయిడ్ సిస్టంతో పనిచేసే ఈ మిషన్‌తో గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే వంటి వాటితో చెల్లింపులు చేయవచ్చు. అలాగే క్రెడిట్, డెబిట్ కార్డులతో సైతం టికెట్స్ పొందే వీలుంటుంది. వీటితో పాటు ఎప్పటిలాగానే నగదు చెల్లింపులు చేసి కూడా సాఫీగా ప్రయాణం సాగించవచ్చు.

ఉద్యోగుల్లో ఆందోళన..

గతంలో టిమ్స్‌ను సంస్థ ప్రారంభించిన అనంతరం పలు దూర ప్రాంతపు సర్వీసుల్లో కండక్టర్లను తీసివేసి డ్రైవర్లకు మాత్రమే టికెట్ల జారీని కట్టబెట్టారు. అలాగే ప్రస్తుతం ఐ–టిమ్స్ అన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తే కండక్టర్లను తీసివేస్తారని వారిలో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇప్పటికే పలు ఆంక్షలతో సతమవుతమవుతున్న తమకు ఐ–టిమ్స్ అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత సైతం లేకుండా పోతుందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం ఉపయోగిస్తున్న టికెట్ ఇష్యూయింగ్ మిషన్

ఆదిలాబాద్ రీజియన్‌లో బస్సుల వివరాలు..

డిపో	ఎక్స్‌ప్రెస్	పల్లె వెలుగు	సెమీ డీలక్స్	లహరి	రాజధాని	సూపర్ లగ్జరీ	మొత్తం
ఆదిలాబాద్	34	67	01	05	00	16	123
భైంసా	09	65	00	00	00	00	74
నిర్మల్	37	65	02	06	05	22	137
ఉట్నూర్	00	25	00	00	00	06	31
ఆసిఫాబాద్	07	56	00	02	00	13	78
మంచిర్యాల	21	84	01	8	03	26	143

పార్టీ విస్తరణే లక్ష్యంగా..

- క్షేత్రస్థాయిపై 'కమలం' దృష్టి
- నేటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



వీధి వ్యాపారులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్: ఒకప్పుడు కనీస ప్రాతినిధ్యం లేని జిల్లాలో ఏకంగా మూడింట్లో రెండు ఎమ్మెల్యేలను భారీ మెజార్టీతో గెలిపించుకునేస్థాయి దాకా బీజేపీ ఎదిగింది. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే కార్యకర్తలు, నాయకులు, స్వచ్ఛందంగా పనిచేసే అభిమానులు ఉన్నప్పటికీ ఈస్థాయికి చేరేందుకు కొన్ని దశాబ్దాలు పట్టింది. నిర్మల్‌లో మహేశ్వర్‌రెడ్డి, ముథోల్‌లో రామారావుపటేల్‌ను ఎమ్మెల్యేలుగా, పార్లమెంట్ ఎన్నికల్లో నగేశ్‌ను ఎంపీగా భారీ మెజార్టీలతో గెలిపించుకున్న తర్వాత జిల్లాలో పట్టు సాధిస్తే భవిష్యత్తు ఉంటుందన్న ఆశను పెంచుకుంది. క్షేత్రస్థాయిలో పట్టు సాధించాలంటే సభ్యత్వ సేకరణే లక్ష్యంగా నిర్ణయించింది. ఆరేళ్లకోసారి పార్టీ చేపట్టే ఈ సభ్యత్వ కార్యక్రమాన్ని జిల్లాలోనూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈనెల 11(బుధవారం) నుంచి అధికారికంగా ప్రారంభించనుంది. గ్రామగ్రామాన ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో తమ పార్టీ సభ్యులు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కూనింటి అంజుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

కార్యకర్తల బలం కోసం..

ఇతర పార్టీలకు బీజేపీకి చాలా తేడా ఉంటుంది. పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా కార్యకర్తలు పనిచేస్తారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పోలిస్తే జిల్లాలో బీజేపీకి కార్యకర్తలు తక్కువే. కానీ ఉన్న వారంతా పార్టీకి కట్టుబడి రెండు ఎన్నికల్లో తమకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేశారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ, బలమైన అభ్యర్థులకు ఇలాంటి కార్యకర్తలు, నేతలు తోడు కావడంతో బీజేపీ భారీ మెజార్టీతో జెండా ఎగరేయగలిగింది. ఇక రానున్న స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికల్లోనూ గెలువాలంటే ఇలాంటి కార్యకర్తల సంఖ్య మరింతగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈనేపథ్యంలోనే సభ్యత్వ సేకరణను పార్టీ విస్తరణకు మార్గం పెట్టుకుంది.

ఆన్‌లైన్‌లోనే సభ్యత్వం..

ప్రతీ ఆరేళ్లకోసారి బీజేపీ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని పెట్టుకుంటుంది. జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈసారి సభ్యత్వ సేకరణలో పార్టీ పలు అంశాలను చేర్చింది. ఎలాంటి రశీదు లేకుండా ఆన్‌లైన్‌లోనే సభ్యత్వ సేకరణ చేపడుతున్నారు.

- నమో ఆప్, క్యూఆర్ కోడ్, లేదంటే 88000 02024 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా మాత్రమే సభ్యత్వ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఈనెల 11నుంచి 25వరకు ప్రాథమిక సభ్యత్వ సేకరణ ఉంటుంది. వచ్చేనెల ఒకటి నుంచి 15వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు ఉంటుంది.
- వంద ప్రాథమిక సభ్యత్వాలు పూర్తిచేసిన వారిని క్రియాశీలక కార్యకర్తగా గుర్తిస్తారు.
- ఒక్కో పోలింగ్ స్టేషన్ పరిధిలో కనీసం 200 సభ్యత్వాలను చేయాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది.
- జిల్లాలో 2 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

దస్తురాబాద్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే సీజీఆర్‌ఎఫ్ లక్ష్యమని సంస్థ చైర్మన్ నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో కడెం, ఖానాపూర్, పెంబి, మామడ మండలాల విద్యుత్ వినియోగదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, మంచిర్యాల్, కుమురంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీజీఆర్‌ఎఫ్ ఏర్పాటైందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సేవా లోపం తలెత్తినా, విద్యుత్ మీటర్, బిల్లులు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలపై వినియోగదారల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ సమస్య ఉంటే పూర్తి వివరాలతో నేరుగా లేదా పోస్టు, మెయిల్, వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్య పరిష్కరం కానిపక్షంలో ఫోరం సభ్యులు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, డీఈ నాగరాజు, ఏడీ లక్ష్మణ్ నాయక్, ఏఈలు కొశెట్టి శ్రీనివాస్, సుమన్, శ్రీనివాస్, రామ్‌సింగ్, బాలయ్య, సబ్ ఇంజినీర్లు నాగరాజు, స్వాతి, సాయికిరణ్ ఆయా గ్రామాల విద్యుత్ వినియోదారులు పాల్గొన్నారు.



వినియోగదారుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నారాయణ

క్లుప్తంగా

ఆలయంలో చోరీ..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ హనుమాన్ ఆలయంలో సోమవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, ఆలయ పూజారి కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం ఆలయం తెరిచేందుకు వచ్చిన పూజారికి హుండీ కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికాడు. ఎక్కడా కనిపించక పోవడంతో వెంటనే కాలనీవాసులకు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్: మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్.రమేష్ కథనం ప్రకారం.. చంద్రవెల్లికి చెందిన కంపెల రాము(28) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సెంట్రింగ్‌లో నష్టాలు రావడంతో ఇతర కూలీ పనులకు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. మృతుడి అన్న కంపెల గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గణపతి వద్దకని వెళ్లి.. బాలిక అదృశ్యం


వర్షా (ఫైల్)

కుభీర్: గణపతి మండపం వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన బాలిక, కనబడకుండా పోయిన ఘటన కుభీర్ మండలంలోని అంతర్ని తండాలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్, పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పొన గ్రామానికి చెందిన రాథోడ్ రమేశ్– అనిత కుటుంబం గత ఏప్రిల్‌లో అంతర్ని తండాకు వలస వచ్చింది. రమేశ్ వ్యవసాయ పాలేరుగా పనిచేస్తుండగా, అనిత ఇంటివద్దే ఉంటోంది. ఆ దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా, వారి చిన్న కూతురు రాథోడ్ వర్షా(5) సోమవారం 11గంటల సమయంలో గణపతి మండపం వద్దకు వెళ్లివస్తానని తల్లితో చెప్పి, సాయంత్రం వరకూ ఇంటికి రాలేదు. గ్రామస్తుల సహకారంతో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఇళ్లస్థలాల కేటాయింపులో అన్యాయం'

పాతమంచిర్యాల: జిల్లాలోని నస్పూర్ శివారు సర్వేనంబర్ 42లో టీఎన్జీవోస్ కోటా కింద ఇళ్ల స్థలాల కేటాయింపులో రిటైర్డ్ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని విశ్రాంత ఉద్యోగులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో మంగళవారం మాట్లాడారు. గతంలో జిల్లాలో పని చేసిన టీఎన్జీవోలకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించిందని, ఆ భూమిలో కోర్టు కేసులు ఉండడం వల్ల కాలయాపన జరిగిందని తెలిపారు. గతంలో పని చేసిన టీఎన్జీవో అధ్యక్షుడు సురేష్‌బాబు అవకతవకలకు పాల్పడి ఎనిమిది మంది అర్హత లేనివారికి ఇళ్లపట్టాలు ఇప్పించారని ఆరోపించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అక్రమ దందాల వల్ల తాము ప్లాట్లు కోల్పోయే ప్రమాదం వచ్చిందని ఆరోపించారు. అర్హత లేని వ్యక్తులకు కేటాయించిన ప్లాట్లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల సాధనకు న్యాస్..

- జాతీయ సాధన సర్వే కోసం ప్రాక్టీస్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదలైన మాక్ పరీక్షలు
- అభ్యసనా సామర్థ్యాల మెరుగునకు ప్రత్యేక కార్యాచరణ
- నవంబర్‌లో జాతీయస్థాయి సర్వే పరీక్ష..


మాక్ పరీక్షను రాస్తున్న ప్రభుత్వపాఠశాల విద్యార్థులు

ఉమ్మడిజిల్లా విద్యార్థుల వివరాలు: (3వ,6వ,9వ తరగతులు)

జిల్లా	విద్యార్థులు
నిర్మల్	13,539
ఆదిలాబాద్	15,579
మంచిర్యాల	11,450
కుమురంభీం	11,179

నిర్మల్‌ఖిల్లా:విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు జాతీయ స్థాయిలో ప్రతీ మూడేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వ ఎన్‌సీఈఆర్టీ జాతీయ సాధన సర్వే(న్యాస్) నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు ఈ సంవత్సరం నవంబర్ 19న ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో పరీక్ష ద్వారా సర్వే నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. న్యాస్(నేసనల్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహణ, విద్యార్థులను సిద్ధం చేయాల్సిన తీరుపై ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ పరీక్షను ప్రాథమిక స్థాయిలో మూడో తరగతి, ప్రాథమికోన్నత స్థాయిలో ఆరో తరగతి, ఉన్నత స్థాయిలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్నారు. ప్రతీరోజు ప్రత్యేక బోధనాభ్యసన ప్రక్రియను చేపడుతూ వారి సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే న్యాస్ పరీక్షలో ప్రతిభ కనబర్చేందుకు విద్యార్థులకు మోడల్ పరీక్షలను మాక్ టెస్ట్‌ల రూపంలో మూడుసార్లు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆయా జిల్లా విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు మంగళవారం మొదటి మాక్ పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.

స్థానం మెరుగుదలకు ప్రయత్నం...

పాఠశాలస్థాయి విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు సన్నగిల్లుతున్నాయని 2017, 2021 సంవత్సరాల్లో నిర్వహించిన న్యాస్ ఫలితాలు వెల్లడించాయి. జాతీయస్థాయిలో తెలంగాణకు మొదటి 20 స్థానాల్లోనూ స్థానం దక్కలేదు. దీంతో ఈసారైనా మంచి ఫలితాలను రాబట్టాలనే లక్ష్యంతో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రాథమికస్థాయిలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత స్థాయిలో లిప్ ప్రోగ్రాం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ద్వారా ఉపాధ్యాయులకు, అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ఇందులో భాగంగానే నవంబర్లో నిర్వహించే జాతీయస్థాయి సాధన సర్వే పరీక్షకు సిద్ధం చేయడంలో భాగంగా మూడు మోడల్ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. సెప్టెంబర్ 10న, సెప్టెంబర్ 30న, నవంబర్ 8న మాక్ టెస్టులు నిర్వహించేందుకు షెడ్యూలు ప్రకటించారు. ప్రధాన పరీక్ష నవంబర్‌లో నిర్వహించనున్నారు. ఈసారి జాతీయస్థాయి సాధన పరీక్షలో రాష్ట్రం స్థానాన్ని మెరుగుపరిచేందుకు జిల్లాల వారీగా కార్యచరణను ఇప్పటికే మొదలుపెట్టారు.

మొదటి మాక్ టెస్ట్ నిర్వహణ...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, పంచాయతీరాజ్, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లోని మూడు, ఆరు, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థులందరికీ మంగళవారం మొదటి టెస్టు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు దాదాపు 50 వేలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు.

నిర్వహణకు నిధులు...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జిల్లాస్థాయిలో ప్రశ్నపత్రాల ముద్రణలకు పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ప్రత్యేక నిధులను కేటాయించింది. ఉమ్మడి జిల్లాలో పరీక్షలకు రూ.5.05 లక్షలు కేటాయించగా, ప్రస్తుతం 50 శాతం నిధులు రూ.2.52 లక్షలు విడుదల చేశారు.

మంచి ఫలితాలు రాబట్టేలా కార్యాచరణ...



ప్రతీ మూడేళ్లకోసారి జాతీయస్థాయిలో నిర్వహించే సర్వే పరీక్ష(న్యాస్)ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మదిస్తారు. ఈసారి జిల్లాలో మంచి ఫలితాలను రాబట్టేలా పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులకు ఇదివరకే తగిన శిక్షణను అందించాం. నవంబర్‌లో నిర్వహించే ప్రధాన పరీక్షకు ముందు మాదిరి పరీక్షలను మూడుసార్లు నిర్వహిస్తున్నాం. మొదటి మాదిరి పరీక్ష మంగళవారం పూర్తయింది. – డాక్టర్ ఎ.రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, నిర్మల్

మలేషియా సదస్సుకు నిర్మల్ వాసి


మలేషియాలో నిర్వహిస్తున్న జాతీయసదస్సులో స్వదేశ్ (కుడి నుంచి రెండో వ్యక్తి)

నిర్మల్‌ఖిల్లా:మలేషియా రాజధాని కౌలాలంపూర్ బీడబ్ల్యూఐ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల సదస్సుకు ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ పరికిపండ్ల హాజరవుతున్నారు. కార్మికులు, కార్మిక సంఘాల ప్రాథమిక హక్కులు, పర్యావరణ విపత్తులు, ఆర్థికమాంద్యం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితర అంశాల ఆధారంగా ''బలమైన శక్తిగా ఎదుగుటకు కార్మిక సంఘాల కృషి'' అనే అంశంపై ఈనెల 10 నుంచి 12 వరకు సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో తెలంగాణ నుంచి స్వదేశ్ పరికిపండ్లకు ఆహ్వానం అందింది. ''స్ట్రాంగ్ టుగెదర్ యూనియన్ మేక్స్ ఇట్ బెటర్'' అనే థీమ్‌పై వివిధ దేశాల నుంచి హాజరయ్యే నాయకులు, కార్మిక సంఘాల నేతలు ఇందులో తమ అభిప్రాయాలను వెల్లడిస్తారని స్వదేశ్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా మలేషియా దేశంలో ఉన్న తెలంగాణవాసులను కలవనున్నట్లు ఆయన తెలిపారు.

'లాభాల వాటా వారికీ చెల్లించాలి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి యాజమాన్యం లాభాల వాటా శాశ్వత కార్మికులతోపాటు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకూ సెప్టెంబర్ చివరిలోగా చెల్లించేలా ప్రకటన చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం పత్రికలకు విడుదల చేసిన లేఖలో డిమాండ్ చేశారు. సింగరేణిలోనే కాకుండా అసెంబ్లీలోనూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు లేరని ప్రచారం చేసిన బీఆర్ఎస్ పాలకులకు కోల్‌బెల్ట్‌లో గత ఎన్నికల తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించారని గుర్తు చేశారు. సొంతింటి పథకం, ఇన్‌కం టాక్స్, మూరు పేర్ల మార్పు, అండర్ గ్రౌండ్ గనుల ఏర్పాటు, ఉద్యోగ అవకాశాలు, కాంట్రాక్ట్, ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలనువిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినికి అస్వస్థత

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని డెటాల్ తాగడంతో అస్వస్థతకు గురైంది. పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ముగ్గురు విద్యార్థినులను ప్రిన్సిపాల్ కనిక మందలించడంతో ఓ విద్యార్థిని మనస్థాపానికి గురై డెటాల్ తాగింది. తాను డెటాల్ తాగానని పాఠశాల సిబ్బందికి తెలుపగా, వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ కనికను సంప్రదించగా ముగ్గురు విద్యార్థినులను సున్నితంగా మందలించగా, ఒక విద్యార్థిని డెటాల్ తాగిందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు.

మంచిర్యాలలో వ్యభిచారం..!

- పోలీసుల అదుపులో ఆరుగురు యువకులు, నలుగురు మహిళలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో లాడ్జీలనే కేంద్రంగా చేసుకొని వ్యభిచారం సాగిస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు మంగళవారం రాత్రి జన్మభూమి నగర్‌లోని ఓ లాడ్జిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, ఆరుగురు యువకులు, నలుగురు మహిళలు పట్టుబడినట్లు తెలిసింది. పోలీసులు విటుల వివరాలు సేకరిస్తున్నట్లు, సంబంధిత వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించనున్నట్లు సమాచారం.

నియామకాలంటూ లెటర్స్?

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆఫీస్ లెవల్ ఉద్యోగాల నియామకాలు అంటూ.. అపాయింట్మెంట్ లెటర్స్ బయటపడటం స్థానికులను కలవరపెడ్తున్నయ్. ఓ ఏజెన్సీ పేరిట ఇవి వస్తుండగా.. దానికి ఎలాంటి గుర్తింపు లేదని తెలుస్తోంది. కాగా ఒక్కో లెటర్‌కి రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ లెటర్లో సంవత్సర జీతం రూ.3.5లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఉంది. అధికారికంగా నియామక ప్రక్రియ మొదలు కాలేదని, అలాంటి వాటిని నమ్మొద్దని అధికారులు చెబుతున్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎంప్లాయిస్మెంట్ కార్యాలయానికి వెళ్లి తెలుసుకోవాలని అధికారులు సూచించారు. ఇంకా ఏజెన్సీ యొక్క పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దేవుడికి పూలు తెస్తానని వెళ్లి..

- చెరువులో దిగగానే ఫిట్స్
- ఎవరూ గమనించకపోవడంతో ప్రాణాలు వదిలిన వ్యక్తి

నిర్మల్‌టౌన్: వినాయకుడి పూజకు పూలు తీసుకువస్తాని వెళ్లిన ఓ వ్యక్తి.. చెరువులోనే విగతజీవిగా మారాడు. ఈ ఘటన నిర్మల్ పట్టణంలో మంగళవారం జరిగింది. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మహాలక్ష్మి వాడ డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన సాయి గజానంద్ (38) వినాయకుడి పూజకు పూలు తెచ్చేందుకు పట్టణ శివారులోని ఎల్లపెల్లి చెరువుకు వెళ్లాడు. అందులోని తామర పూలు కోసే సమయంలో అతనికి ఫిట్స్ రావడంతో అందులోనే పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగాడు. ఊపిరి ఆడక మృతిచెందాడు. మధ్యాహ్నం అటువైపు వెళ్తున్న స్థానికులకు మృతదేహం కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గజానంద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైన్‌షాప్‌లో చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు

- రూ.30,790 విలువైన మద్యం రికవరీ, ఆటో సీజ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటేశ్వర్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి వైన్‌షాప్‌లో ఈ నెల 2న జరిగిన దొంగతనం కేసు వివరాలను మంగళవారం ఏసీపీ వెంకటేశ్వర్లు మీడియా సమావేశం నిర్వహించి వెల్లడించారు. నిందితులు మేకల లక్ష్మణ్, కోట కుమార్, ధర్మేందర్, బన్నీ నలుగురు పార్‌పల్లి వైన్‌షాప్ వెనుకభాగంలో ఉన్న తలుపులు పగులకొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. మద్యంతో పాటు సీసీ కెమెరాలు ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వాయిపేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు పట్టుబడ్డట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.30,790 విలువ గల మద్యం రికవరీతో పాటు ఆటోను సీజ్ చేసినట్లు వివరించారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెంకటేశ్వర్ వివరించారు. కార్యక్రమంలో చెన్నూర్ సీఐ రవీందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

దేశ రక్షణకు పాటుపడేది బీజేపీ

- కాంగ్రెస్‌వి విభజన రాజకీయాలు
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి


సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆదిలాబాద్: దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ కుటుంబ పార్టీ కాదని, దేశం కోసం, ధర్మం కోసం పాటుపడుతున్న పార్టీ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ వేదికల్లో దేశాన్ని గురించి విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఆయన మన దేశవాసి కాదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలు చేసిందని, సెక్యులరిజం పేరిట మతతత్వాన్ని ప్రోత్సహించిందని మండిపడ్డారు. ప్రస్తుతం పొరుగు దేశాల్లో హిందువులపై అనేక దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ హిందువు మేలుకోవాలని, వారిని మేల్కొల్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్తపై ఉందని తెలిపారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీయే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బద్దం లింగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే ప్రాజెక్టు నిర్మించాలి


అధికారులకు వివరిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: తమ డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే కడెం పరీవాహక ప్రాంతమైన కుప్టి వద్ద హైడల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని ముంపు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం కుమారి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జలాశయ, భూనిర్వాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముంపు గ్రామస్తులు తమ డిమాండ్లను అధికారులకు విన్నవించగా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్, మండల ప్రాథమిక పాఠశాలలను అధికారులు సందర్శించారు. సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ విఠల్, డీఈఈ భీంరావు, జేఈఈ జాదవ్ ప్రకాష్, తహసీల్దార్ ఎంఎ కలీమ్, ఆర్ఐ నాగోరావు, సర్వేయర్లు శంకర్, హరిలాల్, ఎస్సై శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

40శాతం లాభాల వాటా చెల్లించాలి


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి లాభాలు వెంటనే ప్రకటించి, 40శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆర్కే 7గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. కంపెనీ ఉత్పత్తి లక్ష్యాల కోసం కార్మికులు ఎంతో కష్టపడి పని చేశారని తెలిపారు. ప్రతీ కార్మికునికి 250గజాల ఇంటి స్థలం, రూ.50 లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చి సొంతింటి పథకం అమలు చేయాలని పేర్కొన్నారు. కోలిండియాలోని అన్ని అనుబంధ కంపెనీల్లో యూనియన్ సభ్యత్వ ధ్రువీకరణ నమోదు కోసం చెక్ ఆఫ్ సిస్టంను ఏర్పాటు చేసి పారిశ్రామిక సంబంధాల వ్యవస్థను కొనసాగించాలని తెలిపారు. 11వ వేతన ఒప్పందం పూర్తిస్థాయిలో అమలు చేయాలని, సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు బోయిన మల్లేష్, కట్కూరి సతీష్, గొల్ల మహేందర్, మోతే ఓదెలు, మిట్ట నాగరాజ్, గుంటి శ్రీధర్, కుంట రాజు పాల్గొన్నారు.

గృహిణిపై డెలివరీ బాయ్ అత్యాచారయత్నం

- బాధితురాలు కేకలు వేయడంతో పారిపోయిన నిందితుడు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో ఓ గృహిణిపై ఆన్లైన్ డెలివరీ బాయ్ మంగళవారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం... మంజులాపూర్‌కు చెందిన ఓ గృహిణి ఫ్లిప్‌కార్ట్‌లో ఓ వస్తువు ఆర్డర్ చేసింది. ఆ వస్తువును ఓ డెలివరీ బాయ్ తీసుకుని మంగళవారం ఉదయం సదరు గృహిణి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరని, ఆమె ఒంటరిగా ఉందని గ్రహించి ఆమెపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆ గృహిణి వెంటనే తేరుకొని, అప్రమత్తమై కేకలు వేసింది. కేకలు విన్న స్థానికులు గృహిణి ఇంటికి చేరుకోగా... డెలివరీ బాయ్ భయపడి పారిపోయాడు. వెంటనే గృహిణి, స్థానికులు, కుటుంబ సభ్యులతో కలిసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. విచారణ జరిపిన ఎస్సై సాయికుమార్ నిందితున్ని వెతికి పట్టుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈ కామర్స్ డెలివరీ బాయ్ ఎవరు వచ్చినా, వారిని ఇంటి లోపలికి అనుమతించొద్దన్నారు. గేటు బయట ఆపి పార్సిల్ తీసుకొని జాగ్రత్త పడాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు ఇంటికి వస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

గుప్త నిధుల తవ్వకాల కలకలం?


పూడ్చిన గుంతను పరిశీలిస్తున్న రైతులు

బేల: మండలంలోని కాప్సి(బి) గ్రామ రోడ్డు మార్గంలోని షంషాబాద్ రెవెన్యూ గ్రామ శివారు ఓ చేనులో గుప్త నిధుల తవ్వకాలు కలకలం సృష్టించాయి. ఆ చేనులోకి మంగళవారం పనులకు వెళ్లిన రైతు పూడ్చిన గుంతను చూసినక్రమంలో పక్కన కనిపించిన పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, పెరుగు, బియ్యాన్ని చూసి ఆందోళన చెందాడు. ఆ స్థలంలో ఎవరైనా గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారా ?, లేదా ఇంకా ఏమైందోనని స్థానిక రైతుల సహకారంతో ఎస్సై రాధికకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో జేసీబీతో ఆ గుంతను తవ్వి చూడగా, ఏమీ లభించకపోవడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇక్కడ సోమవారం రాత్రి చేపట్టిన తవ్వకాలు గుప్త నిధుల కోసమా, మరి ఇంకా ఎందుకు జరిపారో ప్రశ్నార్థక పరిస్థితి నెలకొంది. ఈ షంషాబాద్ రెవెన్యూ శివారులోని ఆ చేనులో గుప్త నిధులు కోసం తవ్వకాలు జరుగలేదని, ఒకవేళ ఎవరైనా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఏమైనా ఆధారాలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

'సార్‌మేడిని రద్దు చేసే అధికారం లేదు'


సమావేశమైన సార్‌మేడీలు,ఆదివాసీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: జిల్లా సార్‌మేడిని రద్దు చేసే అధికారం రాజ్‌గోండ్ సేవా సమితికి లేదని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు అన్నారు. ప్రస్తుతం ఉన్న సార్‌మేడి కమిటీ డిసెంబర్ వరకు కొనసాగుతుందని, అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసీ భవన్‌లో మంగళవారం గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ సార్‌మేడీలు, పటేల్లు, ఆదివాసీ జాతి పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. రాజ్‌గోండ్‌సేవా సమితి సోమవారం మంగం విశంరావు రాయి సెంటర్ రద్దు చేసి, కొత్తగా రాయి సెంటర్ జిల్లా సార్‌మేడీగా గంగాధర్‌ను నియమించినట్లు ప్రకటన చేయడం సమాజానికి విరుద్ధమన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సిడాం భీంరావు, ఆదివాసీ సంఘ నాయకులు, తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం నగేశ్, మహిళా సంఘం నాయకురాలు పెందూర్ పుష్పరాణి, అర్క ఖమ్ము, సోనేరావు, సుమన్, బాదిఉరావు, మనోహర్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న వెంకన్న

- ఎస్‌సీసీడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న సులభ్ కాంప్లెక్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న తెలిపారు. సీసీసీలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం యూనియన్ రాష్ట్ర సదస్సు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 200 సులబ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయని, ఇందులో పనిచేసే కార్మికులు నేడు ప్రమాదకర స్థితిలో ఉన్నారన్నారు. చాలా కాలం పాటు ఇందులో పనిచేయడం వల్ల అనేక మంది కార్మికులకు గుండె సంబంధిత జబ్బులు వస్తున్నాయని, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లకు గురవుతున్నారని పేర్కొన్నారు. వారికి కంపెనీ నుంచి ఎలాంటి వైద్య సౌకర్యం అందడం లేదని, ఈఎస్ఐ ద్వారా వైద్య చికిత్స అందించాలని, ఈపీఎఫ్ అమలు చేయాలన్నారు. సింగరేణి యాజమాన్యం గాని సులబ్ కాంప్లెక్స్ నిర్వహణ సంస్థ గాని స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మల్లన్న, యూనియన్ నాయకులు గజ్జి మల్లేష్, శోభ, అరుణ, ముత్యాల వెంకటేష్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన ఎస్సై


రేష్మను కాపాడిన పోలీసులు

బాసర: ఆత్మహత్యకు యత్నించిన మహిళను ఎస్సై కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రేష్మ గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వస్తున్నట్లు మంగళవారం డయల్ 100కు సమాచారం అందింది. దీంతో నిజామాబాద్ జిల్లా నవీపేట, నిర్మల్ జిల్లా బాసర పోలీసులు అప్రమత్తమై తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరి నది బ్రిడ్జి వద్ద మహిళ కనిపించడంతో బాసర ఎస్సై గణేష్ అప్రమత్తమై కాపాడారు. స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.